
# దీపావళి



దీపావళి కథల పోటీలో
రు. 750 లు
బహుమతి పొందిన కథ

నేను నిద్ర లేచేటప్పటికే, మాబాబు వాళ్లమ్మని ఏదో మారాం చేస్తున్నాడు. కళ్లు నులుముకొని చూచేటప్పటికి చిందులు కూడా తొక్కుతున్నాడు.

"ఏమిటి, ఇంత ప్రొద్దున్నే వాడి చేత నాట్యం చేయిస్తున్నావ్?" అన్నాను లక్ష్మితో

దానికి లక్ష్మి నవ్వుతూ, "వాడు చేయటం కాదండీ! నా చేతే చేయిస్తున్నాడు" అంది

''ఇంతకీ, ఏమిటి సంగతి?'' అన్నాను

''ఏముంది. ఈయనగారికి తుపాకి కావాలట''

"తుపాకా! వీళ్ల పంతులేమన్నా అన్నాడా ఏమిటి?''

"అదికాదండి. . "

"పోనీ, మనింట్లో ఎవరేమన్నా అన్నారా? ఏం బాబూ! చెప్పు మీ అమ్మేమైనా అందా? ఐనా దానికి తుపాకి కావాలా? నేను లేనూ పెద్ద తుపాకిని.'' అన్నాను బుజ్జగిస్తూ

''అదికాదు నాన్నగారూ! దీపావళి పండగొస్తుందిగా అందుకు మా బళ్లో చాలామంది కొనుక్కున్నారు నా ప్రక్కన కూర్చునే రాజుగాడు కూడా కొనుక్కున్నాడు ఒక్కసారి మోగించి యిస్తానంటే ఇవ్వలేదు" అన్నాడు బిక్కమొహం పెట్టి

''ఓ అదా! సాయంత్రం వస్తూ, తెస్తాలే!'' అన్నాను

''నిజంగానా!'' అన్నట్లుగా చూచాడు వాడు నమ్మకంలేదు కామాల వెధవకి

''మీ అమ్మమీద ఒట్టు'' అన్నాను ఆనందంగా చిందులుతొక్కుతూ వెళ్లిపోయాడు. ఈ పిల్లలకి ఏడుపొచ్చినా చిందులే, సంతోషం కల్గినా చిందులే కాబోలు వాడి వంకే చూస్తున్న నన్ను "బాగుంది మీ

వరస ! వాడు అడగటం, మీరు ఔనంటం.'' అంది రుసరుసలాడ్తూ లక్ష్మి.

''ఏం. కాదనమంటావా ?''

''కాదనమని ఎవరనమన్నారు. అప్పుడే ఎందుకు, ఇంకా నాలుగు రోజులాగి పండగ ముందు తెస్తాలే అనలేకపోయారు.''

''ఎప్పుడైనా తెచ్చేదేగదా ! పోనీ !''

''మీ రిలాగే పోనివ్వండి. పండ గొచ్చే నాటికి వాడది చెడగొట్టేసి మళ్ళా ఇంకో దానికి తయారు'' అంది.

''వాడు తయారేగాని, నన్ను ఆఫీసుకు తయారు చేసే దేమన్నా ఉందా ?'' చిరునవ్వు నవ్వుతూ అన్నాను.

'రా. నాయనా. రా. పళ్ళు తోమి లాల పోస్తాను.''

''అమ్మా !''

''ఇప్పు డత్తగారెందుకు ?''

''నీమీద ఫిర్యాదు చేయటానికి కాదులే. ఏది ?''

''వంట్లో సరిగా లేదు.''

# దీ పా వ ళి

''మరి, చెప్పలేదే ?''

''ఎక్కడ చెప్పనిచ్చారు. మీతో, మీ కొడుకుతోటే సరిపోయే.''

''ఆ ! ఇంతకీ వాడేడీ ?''

''చేరుంటాడు నాయనమ్మ దగ్గరకు.'' నేను మా అమ్మ ఉన్న గదిలోకి వచ్చేటప్పటికి, నా సుపుత్రుడు వాళ్ళ నాయనమ్మను తుపాకి సంగతే అడుగుతున్నాడు.

''హరి. నేను తెస్తానన్నాను కదరా !'' అన్నాను. వాడు చల్లగా జారుకున్నాడు అక్కడ నుంచి.

''అన్నీ నీ బుద్ధులేనురా అబ్బాయి. వాడికి'' నవ్వుతూ అంది అమ్మ, సరిలేక పోయినా. ఈ మాట రోజు కొకసారైనా అనకపోతే అమ్మకు తృప్తి ఉండదు.

''ఎలాగుందమ్మా ?'' అనడిగాను.

''ఎలాగుండేదేమిటిరా. వయసయిపోటంలా. అంతకు మించిన అనారోగ్య మేముంది, ఈ శరీరానికి.''

''అని, మందులు వాడటం అశ్రద్ధ చేయ కమ్మా !'' అన్నా. ''అన్నయ్యకు జవాబు ఏమని వ్రాయమంటావమ్మా ?'' అని అడి గాను. ''వ్రాశేదేముందిరా. అంత దూరం ఇప్పుడెక్కడ వెళ్తాను. ఈసారికి అమ్మ రాలేదులే అని వ్రాయి'' అంది. నాకూ, అదే రాయాలని ఉంది. అమ్మని, దీపావళి పండక్కి ఇక్కడకు పంపు అంటూ వ్రాశాడు అన్నయ్య. వాడు విశాఖపట్నంలో లెక్చరర్‌గా పనిచేస్తు న్నాడు. నలుగురు పిల్లలూ, సంసారం. వాడి కొచ్చే జీతం సంసారానికి సరిపోతుంది. ఇంకా అక్కడికి అమ్మని పంపి బాధ పెట్టడం అనవసరం.

కాఫీ ఇస్తూ లక్ష్మి, ''మా అమ్మా వాళ్లకు కూడా ఉత్తరం వ్రాసేయండి'' అంది.

''ఏమని ?''

''తెలియనట్లడుగుతారే. మీ అమ్మాయి రావటానికి వీలుపడదని.''

---

## *దీపావళి కథలపై వ్యాసరచన పోటీ, పాఠకుల బాలట్ !*

★ ఈ వారంతో దీపావళి పోటీలో ఎన్నికైన నాలుగు కథల ప్రచురణ పూర్తి అయింది. అకారాదిగా వర్ణమాలక్రమంలో వాటి పేర్లు ***కుంటికాకి, గృహవిక్రయం, దీపావళి, పట్టుచీర.*** వీటిని పాఠకులు తమకు నచ్చిన క్రమంలో యీ సంచికలోని బాలట్ పత్రంలో వ్రాసి, ఏ కథకు ఏ స్థానం యివ్వాలో నిర్ణయించాలి.

★ కథలు మీకు ఎందుకు నచ్చాయో తెలియచేస్తూ ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ఒక కాలమ్ మించకుండా (750 లేదా 800 అక్షరాలు మించకుండా) ఒక వ్యాసం వ్రాసి, దానితోపాటు బాలట్ పత్రాన్ని పూర్తిచేసి రెండిటిపైనా పూర్తి చిరునామా వ్రాసి, రెండూ జతచేసి కవరులో పెట్టి ''దీపావళి కథలపై వ్యాసరచనపోటీ'' సంపాదకుడు, ఆంధ్ర సచిత్ర వారపత్రిక, గాంధీనగరం, విజయవాడ—520003 కి పంపాలి

★ వ్యాసాలలో ఉత్తమమయిన మూడింటికి రు. **250** లు, రు. **200** లు, రు. **150** లు ఆ వరుసలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు యిస్తాము.

సంపాదకునిదే తుది నిర్ణయం ఉత్తర ప్రత్యుత్తరాలకు తావు లేదు.

**వ్యాసాలు, బాలట్ పత్రాలు మాకు**
**అందవలసిన ఆఖరుతేదీ 14-12-1974**

***బాలట్ పత్రం యిదే సంచికలో 5 వ పేజీలో వేశాము. బహుమతులుపొందిన నలుగురు రచయితలుతప్ప పాఠకులంతా వ్యాస రచనపోటీలో పాల్గొనవచ్చును.*** — సం.

"అక్కడ, మీవాళ్ళ నువు పోతానంటే, నేనేదో నిన్ను పగ్గాలుపట్టి వెనక్కు లాగుతున్నాను అనుకునేనుసుమా!" అన్నాను నవ్వుతూ. మా మా మ గా రు మొన్ననే ఉత్తరం వేశాడు, పండక్కి రమ్మంటూ.

కాఫీ తాగ్గానే, లక్ష్మి అందించిన సరుకుల పట్టీ అందుకొని సైకిలెక్కేను. కొట్టతను ఒక్కోదాని ధర చెప్తుంటే, నెత్తిమీద ఒక్కో బాంబు పేల్తున్నట్టుగా వుంది. ఏమిటీ దారుణం అన్పించింది. మెల్లగా ఆ మాటలు బయటికి వచ్చినయికూడా.

"దారుణమా సార్ !" అని నవ్వి, సరుకులు కొంటానికొచ్చిన కొత్తమొఖంలా గుందే అన్నట్టుగా ఎగాదిగా చూచి, "ఈ ధరలు ఏ నెలలో స్థిరంగా వున్నాయి చెప్పండి ? కాకపోతే ఈ నెలలో మరి కొంచెం. అంతేగా !" అత్తి తేలిగ్గా అన్నాడు. ప్రక్కనే సరుకులు కొంటున్న నడివయసాయన. ఆ కళ్ళ, ఆ మొహంతీరు మటుకు అనుభవాలు జీర్ణించుకొని రాటుదేలినట్టుగా ఉంది. ఆ మాటల్లో కొంత నిర్లిప్తత కూడ వుంది. ఏడ్పులోనహితం నవ్వగల మనిషిలాగానూ వున్నాడు

"మేమటుకు ఏం చేస్తాంసార్ ! సంవత్సరం పొడుగూతా ఏదో ఒక బడ్జెట్ వస్తూనేవుండె" అన్నాడు కొట్టతను, తన తప్పేమీ లేదన్నట్టుగా. మాట్లాడకుండా సరుకులు కొన్నాను. చిల్లరేదో మూడు నాలుగు రూపాయలు మిగిలింది జేబులో. బాబుకి తుపాకి కొందామని వెళ్ళాను. కానీ, వెళ్ళిన తర్వాత, దాని ధరా కనుక్కొని కొందామంటే మనసొప్పలేదు, ఎందుకో. కొద్దిసేపు, కొందామా, వద్దా అని ఆలోచించి వెనక్కి తిరిగాను. ఇంతవరకు ఇలా నేనెప్పుడూ ఆలోచించలేదు, బాధపడలేదు జీవితంలో. కానీ, నిత్యం పెరిగే ధరల్తో, సామాన్యుడి పరిస్థితి ఏమిటి, నా పరిస్థితే ఇలా వుంటే. నాకు వచ్చే జీతంతో రాజా జీవితమే గడుపుతున్నాను, ఇక్కడ. ఇది మధ్యతరగతి పట్టణం. సగటున మనిషి ఖర్చు చాలా తక్కువ, చాలా పట్టణాలమీద. అటువంటిది ఒక్కనెలలో ఇన్ని రూపాయలు పెరగటమంటే ... ... ఇంటికొచ్చిన తర్వాత భోంచేస్తున్నంతసేపూ ఇదే ఆలోచన. లక్ష్మి మధ్యలో అడిగిందికూడా.

"రోజూ అవీ, ఇవీ తెగమాట్లాడుతుండే వాళ్ళ, ఇవాళేమిటింత మౌనంగా భోంచేస్తున్నారని ?" ఏం చెప్పలేదు, ఆలోచన తెగక నేను

ఆఫీసుకొచ్చాను. నేనొచ్చేటప్పటికే గేటు దగ్గర నాకోసమేలాగుంది కాపలా కాస్తున్నాడు సుబ్బులు, మా ఆఫీసు ప్యూన్.

"బాబూ !" అన్నాడు చేతులు నలుపుకుంటూ. ఏమిటన్నట్టుగా చూశాను, సైకిల్ షెడ్‌లో పెడదామని, అటు నడుస్తూ. సుబ్బులే, సైకిల్ నాదగ్గర తీసుకొని షెడ్‌లో పెడ్తూ, "ఒక పాతిక రూపాయలు కావాలి బాబూ !" అన్నాడు.

"ఎందుకు ?" అని నోటిదాకా వచ్చింది. అడగటం భావ్యంకాదని ఊరుకున్నా. పెరిగిన ధరల్తో, పెరగని జీతంతో, నాదగ్గర అప్పుగా తీసుకొనే పాతిక రూపాయలు ఏ మూల కబురనుకున్నాను. "ఎప్పుడు కావాలి ?" అన్నాను.

"ఓ రెండ్రోజులాగి యివ్వండి. చాలు బాబూ !" అన్నాడు. "సరే !" నని ఆఫీసులోకి నడిచాను.

బాలట్ వ్రతం
ఆంధ్ర సచిత్ర వారపత్రికలోనిదే
వాడతీరాలి సం.

మధ్యాహ్నం, లీజర్‌లో ప్రక్కనేవున్న కాంటీన్‌లో కాఫీ త్రాగుతుంటే, మా హెడ్ క్లర్కు వచ్చి ఎదురుగా కూర్చున్నాడు. అవీ, యివీ లోకాభిరామాయణం కొద్దిసేపు మాట్లాడుకున్నాం. కాఫీకి బిల్లు నేనివ్వబోతుంటే, అయనే తీసుకొని ఇచ్చి "చూడు మూర్తీ..." అని కొద్దిసేపాగి "ఒక యాభై రూపాయలుంటే సర్దగలవా !" అన్నాడు, కొద్దిదూరం నడచిన తర్వాత.

గంపెడు సంసారం, ధరలు ఆకాశాన్నంటి కనపడకుండా పోతున్న ఈ రోజుల్లో ... "సరే!" నన్నాను. "సాయంత్రం మీ ఇంటికి మా మూడోవాణ్ని పంపుతాను. ఇచ్చి పంపు" అన్నాడు.

సాయంత్రం ఆఫీసు నుండి యింటికి వస్తుంటే కూడా వచ్చిన తోటి ఉద్యోగి, మిత్రుడు "ఆ మందుల షాపులో రెండు తుపాకులు కొనుక్కెళదాం. పద' అన్నాడు.

"రెండా ?" అన్నాన్నేను.

"అవునుమరి ! ఇద్దర్ని కన్నానుగా తప్పదు" అన్నాడు.

అక్కడికి వెళ్ళిన తర్వాత వాడు రెండు కొంటూ, "నీకూ ఒక డున్నాడుగా. కొనెయ్! అన్నాడు. మళ్ళీ ప్రొద్దున వాడికిచ్చిన మాట గుర్తుకొచ్చింది. కొందామా, వద్దా అనే ఆలోచనలో ఉన్నాను.

"ఏమిటిరా, దీనికి ఆలోచన. కొనక" అన్నాడు.

"ఇప్పుడు కాదులే !" అన్నాను. "ఏం జేబులో డబ్బులేల్లేవా ? పోనీ, అప్పిస్తాను" అని, "అయినా, నేను నీకు అప్పిచ్చేటంతటివాణ్ణట్రా ? ఆఫీసర్‌కైనా అప్పివ్వగలవాడివి నువ్వు" అన్నాడు నవ్వుతూ వాడన్నట్టుగా అందరికీ అప్పలివ్వటానికి నా దగ్గర డబ్బు కొల్లలుగా మూలగటంలేదు కానీ, జీతం వచ్చినంతలో, జాగ్రత్తగా మిగిలిస్తూ గడుపుతున్నాను. అవే, అప్పుడప్పుడు ఎవరన్నా తోటి వాళ్ళు అడిగితే ఇస్తుంటాను.

మిత్రు డింటికేసి మిత్రుడ్నొదిలేసి, ఇంటికేసి సైకిల్ నడుపుతున్న నాకు, రోడ్డు ప్రక్కగా సీమ టపాసులు కాలుస్తూ ఒక పిల్లాడు కన్పించాడు. అతనికి వంటినిండా సరిగా బట్టలు కూడా లేవు. జుట్టుకి తైలం అంటే ఏమిటో తెలిసినట్టు లేదు. ఒళ్ళు జుట్టుకి పోటీ పడటం మానలేదు. వరసన కాలుస్తున్నాడు. అవి పేలిపోతున్నాయి, శబ్దం చేస్తూ.

ఇంటి కొచ్చేటప్పటికి సుపుత్రుడు నాకోసమే ఎదురు చూస్తున్నాడు వీధి వాకిట్లో. నేను సైకిల్ ఆపీఆపగానే దగ్గరకొచ్చి, నా చేతులూ, జేబులూ అన్నిటినీ నిశితంగా పరిశీలించసాగాడు. "నాన్నగారూ ! ఏది తుపాకి?" అని చెయ్యి చాపాడు.

"లేదు తేలేదు" అన్నాను. నాకు తెలియకుండానే కొద్దిగ కర్కశత్వం చోటు చేసుకుందా మాటల్లో. వాడు ఏడవసాగాడు చిందులేస్తూ. అమ్మైనా ఒకటే, నాన్నయినా ఒకటే వాడు అడిగింది కాదన్నపుడు, లేదన్నపుడు. ఇంట్లోకి నడిచాను.

"ప్రొద్దున తెస్తానని చెప్పట మెందుకు ? ఇప్పుడు వాడిని ఏడ్పించట మెందుకు ?" అంది లక్ష్మి.

"నువ్వే వద్దన్నావుగా !" అన్నాను నవ్వుతూ. ఆ నవ్వులో ఏదో లోపం కన్పించింది నాకు.

"నేను వద్దన్నానని తేలేదా ? సరే. ఇప్పుడు వాడ్ని సముదాయించమంటున్నాను సముదాయించండి" అంటూ వంటింట్లో

కెళ్లింది వాడ్ని సముదాయించడం నాతరం కాలేదు కోపంవచ్చి పెద్దగా కసురుకునే టప్పటికి, పెద్దగా వెక్కిళ్లుపెట్టి ఏడ్వ సాగాడు. దానికి అమ్మ పరుగెత్తినంత పని చేస్తూ వచ్చింది, అనారోగ్యంలోనూ "ఛ! ఏమిట్రా ఆ కసురుకోవడం. పిల్లాడ్ని సముదాయించడం ఇలానేనా ?" అంటూ వాడ్ని బుజ్జగిస్తూ తీసుకపోయింది, "రేపు తప్పకుండా తెస్తాడులే !" అని చెప్తూ.

రాత్రి భోంచేసి మంచంమీద పడుకున్నానే గాని ఆలోచనలు ఆగటంలేదు. ఇందాక, దోవలో తగిలిన ఆ పిల్లవాడే గుర్తుకువస్తున్నాడు ఇల్లు సర్దేసివచ్చి మంచంమీద కూర్చుంటూ అంది లక్ష్మి. "రేపు పండక్కి ఏం చేయమంటారు ?" అని "ఏదో ఒకటి చెయ్ "

"ఏదో ఒకటంటే .ఏమిటో చెప్పండి."

"ఏమిటా..?" ఈ లోకంలోకొచ్చాను పూర్తిగా "కొంచెం తక్కువ ఖర్చుతో ఏదైతే, అది చెయ్."

"తక్కువ ఖర్చా !" నవ్వి "దిబ్బ రొట్టెలు చేయమంటారా ?" అంది.

"అదికాదు ప్రతినెలా మనం మామూలుగా తెచ్చుకునే సరుకులకే, ఈ నెలలో ఎంత అదనంగా చెల్లించాల్సి వచ్చిందో చూశావుగా !" అన్నాను.

"మన మొక్కళ్లమేనా ఏమిటి? దేశంలో అందరూనూ !" అంది. అతి తేలిగ్గానూ అంది "నిజమే. కానీ, అనవసరపు ఖర్చులు తగ్గించాలని చూస్తున్నాను" అన్నాను.

"ఏమిటి తగ్గిస్తారు. చెప్పండి. ఒక పూటే భోజనం చేద్దామంటారా ?" వేళాకోళంగా అంది

"అలా అన్నానా ! రేపు పండక్కి మందులు కొనకూడదనుకుంటున్నాను" అన్నాను. ఆ మాటలకి కొంచెం పెద్దగానే నవ్వింది. "మందులు కొనరూ ? సంవత్సరాని కొక్కసారి వచ్చే పండగ ఎప్పుడా రమ్మంటే వస్తుందా ? మందులు కొంటే ఎంతకి, ఒక పదికి కొంటారు లేకపోతే పదిహేనుకు కొంటారు. ఐతే, ఇంకో ఐదు ఎక్కువ అంతేగా. ఆ మాత్రానికి, ఖర్చును కొని పండగ చప్పగా చేసుకుందామా ?" అంది.

"నీకేమీ తెలియటంలేదు, అర్థం కావటంలేదు" అన్నాను.

"ఏమిటి తెలియందీ, అర్థం కానిది. అనవసరపు టాలోచనలు మానుకోండి" అంది దీపం ఆర్పేస్తూ "ఏం మీ సోషలిజం మిత్రుడుగాని చెప్పాడా ?". అంది ఇందాక, తుపాకులు కొన్నవాడేను, నా సోషలిజం మిత్రుడు.

మరునాడు ఆఫీసులో, మధ్యాహ్నం లీజర్‌లో నలుగురం కూర్చుని ఆ కబురు ఈ కబురు చెప్పుకుంటున్నప్పుడు, ఈ విషయం ఎత్తాను "ఈమందులూ అవీ కాల్చడమంటే మన డబ్బుకి మనం చేతులారా అగ్గిపుల్ల అంటించుకోవటమేనని." దానికి అందరూ పెద్దగా నవ్వి "మరీ ఇంత పిసినారివైతే ఎలాగురా !" అని ఒకతను, "డబ్బు వడ్డీల కివ్వటం మరిగిన తర్వాత, మరీ నువ్వు మారిపోయావులే బ్రదర్" అని ఒకతను. ఇంకా ఇలాటి మాటలే అంతా అన్నారు నాకు మతి ఉన్నంతవరకూ ఎవరికీ డబ్బు వడ్డీల కివ్వలేదు. అలా ఎదుటివాళ్ళని ఊరికే బాధపెట్టడం కొందరి నైజం "పండగ చప్పగా గడపటంలో ఆనంద మేముందిరా నాన్నా !" అన్నాడు నా సోషలిజం మిత్రుడు.

దీపావళి బహుమతిపొందిన కథ

ఇంటికి వచ్చేటప్పటికి మళ్ళా మావాడు తుపాకి కోసరం ఎదురు చూస్తూనే ఉన్నాడు. ఇవాళ ఆఫీసుకి బయల్దేరుతుంటే అమ్మ కూడా చెప్పింది. తేలేదని గ్రహించిన మరుక్షణమే వాడు ఏడ్పుకు లంకించుకున్నాడు.

"ఏమిట్రా అబ్బాయ్. నువు మరీను మీ నాన్నగారి అలవాటు నీ కొచ్చింది నీ అలవాటు నీ కొడుక్కొచ్చింది." అని నా పుత్రరత్నాన్ని బుజ్జగించే ప్రయత్నంలోపడ్తూ "కోడలితో ఏమిటి మందులు తేనని చెప్పావట" అంది.

"అవునమ్మా ఈ మందులు కాలవటం వలన ఏం ఉపయోగముంది చెప్పు అనవసరంగా డబ్బులు దండగ తప్పితే" అన్నాను. దానికమ్మ, బుగ్గలు నొక్కుకుని, "నువ్వేన్రా ఈ మాట అనటం. చిన్నప్పుడు మీ నాన్నగారు మందులు తేవడం ఒక్క రోజు ఆలశ్యమయితే, ఎంత గోల చేసేవాడివి నిరుడూ చిన్న పిల్లాడిలాగా ఎన్ని మందులు కాల్చా !" అంది. నిజమే. నిరుడు దాదాపు పాతిక రూపాయల పైన నేకాల్చాను.

"నిరుటి పరిస్థితి వేరు, ఇప్పటి పరిస్థితి వేరు" అన్నాను నచ్చచెప్దామనే ప్రయత్నంలో నిరుటి...మొన్నటి నేను, ఇప్పటి నేను వేరు కూడా నామాటేం విన్పించుకోకుండా "వేరు లేదు ఏమీ లేదుగాని, రేపన్నా వీడికి తుపాకి తీసుకరా !" అని గట్టిగా చెప్పి, "మందులు లేకుండా పండగ చప్పగా గడుపుతాడట. ఏమిటో ఈ బుద్ధులు" అనుకుంటూ బాబును తీసుకొని వెళ్లిపోయింది.

లక్ష్మికి అన్నా నచ్చచెప్దామనుకున్నాను. అసలే మాత్రం లాభంలేకపోయింది ఆ ప్రయత్నం అమ్మదగ్గర చేస్తే, అమ్మ నా మాటకు సరేననే దన్పించింది. "అసలతను ఎప్పుడు చూచినా సోషలిజమనీ, అదనీ, ఇదనీ తప్పితే ఇంకేం మాట్లాడడు, అతన్తోటి తిరక్కండీ అని చెప్తే మీరు నా మాట విన్పించుకున్నారూ ? ఇప్పుడు చూడండి ఎలా మారిపోయారో ?" అంది దైన్యం గూడు చేసుకుంది మాటల్లో.

ఆ సోషలిజం మిత్రుడికీ, మందులు లేకపోతే పండగ గడవదని తెలీదు లక్ష్మికి

"అసలు, మా ఇంట్లో ఎంత బాగా చేస్తారు పండగ మీకూ తెలుసుగా" అంది.

అంతా తెలుసు నాకు. ఈ పండగ ఎప్పడొస్తుందా అని ప్రాణం విడిచేవాడిని ఒకప్పుడు, చదువుకునే రోజుల్లో. ఈ పండగ సీజన్ రాగానే, ఆ పుస్తకాలకనీ, ఈ పుస్తకాలకనీ; ఆ ఫీజులనీ, ఈ ఫీజులనీ ఇంట్లో డబ్బులు తీసుకొని కాలేజీ అంతా నానా అల్లరీ చేసేవాడిని తోటి మిత్రులతో కలసి. మా కిష్టంలేని లెక్చరర్ వస్తుంటే, అసమ్మతిగా టపాసులు, బాంబులు ఆయన చుట్టూ వేసి కనపడకుండా తప్పుకోవటం, ఎవరన్నా ఆడపిల్లలు చెప్పేట్లుంటే, మీ జడలకి టపాసులు కట్టి అగ్గిపుల్ల గీస్తానని బెదిరించటం ... ఓహ్ ! అవన్నీ మరపురాని, మరువలేని మధురక్షణాలు. కానీ, అప్పుడు ఎంత...ఎంత డబ్బు తగలబెట్టాను ?

ఈ పండుగకి మందులు పేరుతో మనం డబ్బు తగలబెట్టడం అవివేకం, అనవసరం అని అటు ఆఫీసులోనూ, ఇటు ఇంట్లోనూ ఎవరినీ ఒప్పించలేకపోయాను, ఆఖరికి నా సోషలిజం మిత్రుడితోసహా.

"మొన్నటి ఉద్యమంలో మన ఆఫీసు కాల్చివేస్తే మనమంతా ఎంత బాధపడ్డాం" అన్నాను వాడితో. ఉద్యమం పేరుతో, మా ఆఫీసు ఎరయింది కొందరికి. అప్పుడు, నా సోషలిజమ్ మిత్రుడు పెద్ద ఉపన్యాస మిచ్చాడుకూడా.

"ఇంతకంటే దారుణం ఇంకోటి ఉందా?... లేదు. ఈ ఆఫీసులు ఎవరివి?... మనవి. అంటే ప్రజల సొమ్ము. అంటే మన సొమ్మేగా."

మన ఆఫీసులను, మన సొమ్మును మనం కాల్చుకోవటం అంటే మన ఇంటికి మనం నిప్పంటించుకోవటం కాదా?... అవును.

ఇది మనలో దాగి ఉన్న రాక్షసత్వానికి చిహ్నం కాదా?... అవును ఇలాగయితే, దేశంలో సోషలిజం రమ్మన్నా వస్తుందా? .. రాదు" అని అప్పటిదాకా ఊపిరి పీల్చుకో లేదు వాడు ప్రశ్నలూ సమాధానాలూ అన్నీ వాడివేను

"మందులు కాల్చటమంటే మన డబ్బుని మనం కాల్చుకోవటం కాదా! ఇది దారుణం కాదా? మనలో ఉన్న రాక్షసత్వానికి చిహ్నం కాదా?

నాకు స్టాటిస్టిక్సు తెలియకపోయినా, సగటున మనిషి ఒక రూపాయి ఈ పండక్కి ఖర్చు చేసినా, దాదాపు అరవై కోట్ల రూపాయలు మనం ఈ పండగ పేరుతో బూడిద చేసినట్లే!" అనీ అన్నాను. వాదించాను కూడా. ఎప్పుడూ అదనీ, ఇదనీవాడే వాదిస్తుంటాడు. కానీ, వాడిచేత కూడా ఈ మందులు కాల్చటం అవివేకం, అనవసరం అన్పించలేక పోయాను.

నేనే అవివేకినని తేల్చేశాడు వాడు. వాదించాడు కూడా. దేశంలో 'సోషలిజం' పరిస్థితి ఇలాగుందా అని బాధేసింది నాకు.

పండగ దగ్గరకొస్తుంది. ఇంట్లోవాళ్ళు నన్ను మార్చటానికి ప్రయత్నిస్తున్నారు. నా పట్టు నేను విడవలేదు తుపాకి కొనుక్కెళ్ళ లేదు

"మన మొకళ్ళమే మడి కట్టుకుంటే సరి కాదండి!" అంది లక్ష్మి నన్ను మార్చటానికి కన్నట్లుగ "ఒకళ్ళని చూసి వాత పెట్టుకోవాలనే తత్వం కాబట్టే, మన దేశమిలా ఏడుస్తోంది!" అన్నాను.

"ఆహా! దేశోద్ధారకుడివి బయల్దేరావు లేరా!" అంది అమ్మ. వాడికి తుపాకి తేలేదని అమ్మకి మరీ కోపంగా ఉంది.

లక్ష్మి అదీ, ఇదీ మాట్లాడుతూ, సూటీ పోటీ మాట లంటుంది. "ఇవాళ ఈ పండగని ఇలాగ చేస్తామంటారు. రేపు ఇంకో పండగ చెయ్యొద్దనే అంటారు. మీకేం?" అని బాధపడుతున్నారు వాళ్ళు.

నేను మందులు కొనటం దండుగ అంటున్నానని, నన్ను చూసి మొఖం చాటేస్తున్న, నాదగ్గర డబ్బులు అప్పుగా తీసుకున్న మా హెడ్‌క్లర్కు, సుబ్బులూ మందులు లేందే పండగ జరపటంలేదని తెలుసు. కానీ, ఆ నా ఉద్దేశాన్ని మార్చుకోవాలనే ఆలోచన రాలేదు నాకు.

రెండు మూడు రోజులు గడిచినయి. నేను ఆఫీసు నుండి ఇంటి కొచ్చేటప్పటికి, మా ఇంటిముందు పిల్లలతో ఆడుతూ బాబు కన్పించాడు. వాడి చేతిలో తుపాకికూడా వుంది. అనుమానమొచ్చి "ఎక్కడిదిరా?" అని అడిగాను.

"మిమ్మల్ని తెమ్మంటే మీరు తేలేదుగా. అందుకని నాయనమ్మ వాళ్ల రాముడిచేత తెప్పించింది" అని నవ్వుతూ, ఇంత గర్వంగానో చెప్పి ఆటలో పడ్డాడు. అక్కడి పిల్లలందరికీ, డిటెక్టివ్ సినిమాల అనుభవం లాగుంది. టిష్యుం, టిష్యుం అని శబ్దం కూడా చేస్తున్నారు తుపాకితోపాటు.

ఇంట్లోవాళ్లమీద కోపమొచ్చింది కానీ, ఎవర్ననేని? అమ్మని కోప్పడాలా? ఆ పని ఎప్పటికీ చేయలేను. ఇక లక్ష్మిని కోప్పడాలా? ఏ విషయంలోనన్నా అయితే అమ్మ ఊరుకునేదేమో గాని, ఈ విషయంలో మాత్రం వూరుకోదు. కోపం కొద్దిసేపటికి పోయింది. కానీ...బాధ. అది వదిలిపెట్టలేదు నన్ను.

ఇంకో రెండురోజులు గడిచినయి. పండగ యింకా నాలుగురోజులే వుంది. ఆరోజు ఆఫీసు నుండి కొద్దిగ ఆలస్యంగ వచ్చాను. చీకటిపడింది. వాకిట్లోనే కాకరపువ్వొత్తులు కాలుస్తూ స్వాగతమిచ్చాడు బాబుగాడు. వాడి ప్రక్కన వాడి మేనమామ కూడా వున్నాడు.

"ఎప్పుడొచ్చావు?" అని అడిగాను లోపలకొస్తూ.

"మధ్యాహ్నం బావా!" అన్నాడు. "నిన్నూ, అక్కనీ తీసుకెళ్దాం అని వచ్చాను" అన్నాడు. అతను కనపడగానే నా కర్థమైంది కూడా.

"వీలుపడదని ఉత్తరం రాశానే! అందలేదా?" అన్నాను. దానికతను చిద్విలాసంగా నవ్వాడు. నేను ఎంతో గట్టిగా, రావటానికి వీలుపడదు అని వ్రాసినా వచ్చాడంటే, దీని వెనుక ఏదైనా బలమైన కారణం వుందా అన్పించింది.

ఆ రాత్రి అమ్మ కూడా అంది. "నేనూ పెద్దాడి దగ్గర కెళ్తారా!" అని. ఆశ్చర్యంగా, అవాక్కయి చూశాను. "ఏమిటోరా! మొన్న నీతో అలా అన్నానా! ఇప్పుడేమో పిల్లల మీద గాలి మళ్ళిందిరా!" అంది. ఉదయమే ప్రయాణానికి సర్దుకోసాగింది, నన్ను ఏమీ మాట్లాడనీయకుండా.

"పాపం. మీరు రామని వ్రాశారని మీ మామయ్య తెగ బాధ పడుతున్నాడట. రెండు రోజులు సెలవు పెట్టి నువుకూడా రేపే వెళ్ళు" అంది. లక్ష్మిని ప్రయాణానికి సిద్ధం చేయించింది. నేను గట్టిగా వెళ్ళమనీ చెప్పలేదు. వెళ్ళొద్దనీ చెప్పలేదు.

అమ్మ ప్రోద్బలం కాని, లక్ష్మికి నామీద వచ్చిన కోపంగాని, లోపల అణగి ఉన్న కోర్కెగాని, ఏదైనాగాని లక్ష్మి ప్రయాణమైంది.

నేను ఆగమన్నా ఆగే స్థితిలో లేరు వాళ్ళు.

ఈ రెండు రోజులూ సెలవు దొరకదు అని చెప్పి ఆగిపోయాను నేను. వాళ్ళని రైలెక్కించాను. బండి కదులుతుంటే అమ్మ అంది. "కోపంతో రేపు అత్తగారింటికి వెళ్ళకుండా ఇక్కడే ఉండేవు. నీ వాలకం చూచి నేనే అమ్మాయిచేత ఉత్తరం రాయించాను. టపాసులు కాల్చినా, ఏం కాల్చినా నీ సొంత డబ్బులేం కాదుగా. వెళ్ళు" అంది నవ్వింది కూడా.

లక్ష్మి దాదాపు అదేమాటలంది. "కోపం వచ్చి రాకుండా ఉంటారా! నామీద ఒట్టే. ఐనా, మందులు మా నాన్న డబ్బులేగా. రండి" అంది. లక్ష్మి కనుకొనల్లో నీళ్ళు కూడా నిల్చినయి

"నువ్వు కాదు లక్ష్మి ఏడవాల్సింది. నేను" అనుకున్నాను మనసులో. బండి వెళ్ళిపోయింది. నడుస్తున్నాను. నిజంగానే ఏడుపొచ్చింది.

"వీళ్ళు ... వీళ్ళు...ఇంతాజేసి నన్నర్థం చేసుకుంది ఇలాగా?" అని. ●

పైవారమే కొత్త సీరియల్

**అహం - అనురాగం**

ప్రారంభం!